క్లుప్తంగా



మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజని మంగళవారం ఉదయం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

–సాక్షి, నరసరావుపేట

పరీక్షల్లో ఒత్తిడికి దూరంగా ఉండాలి: డీఈవో

నూజెండ్ల (శావల్యాపురం): పదోవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్‌.చంద్రకళ సూచించారు. మంగళవారం మండలంలోని నూజెండ్ల, ములకలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఉప్పలపాడులో ఎంపీపీ స్కూళ్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పదోవ తరగతిలో నూరుశాతం ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని చదవటం విద్యార్థులను అలవరుచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలనతో పాటు అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తేవాలన్నారు. ఆయా పాఠశాలల్లో పదోవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం నూజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో నిలిచిపోయిన అదనపు తరగతి గదులు నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఎంఈవో రవిచంద్ర, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

రొంపిచర్ల: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొన్న సంఘటన కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ హైవేపై స్థానిక తంగేడమల్లె మేజర్‌ కాలువ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన పేరుబోయిన అంకమ్మరావు తన పొలంలో కోసిన మిరపకాయలను ట్రాక్టర్‌లో లోడ్‌ చేసుకొని నడుపుకుంటూ ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో ట్రాక్టర్‌ నడుపుతున్న అంకమ్మరావుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 ద్వారా నరసరావుపేటలో ఒక ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ ఐ మణి కృష్ణ తెలిపారు.

బొల్లాపల్లిలో పట్టపగలే చోరీ

బొల్లాపల్లి: పట్టపగలే చెలరేగిపోతున్న దొంగలు.. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు.. రెండు రోజుల క్రితం మండల కేంద్రం బొల్లాపల్లిలో భారీ స్థాయిలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన పి.రామకృష్ణారెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నగదు, నగలు భారీస్థాయిలో చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఇటీవల పట్టపగలే దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆయా గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. ఇళ్లలో విలువైన వస్తువులు దోచుకొని వెళ్తున్నారని తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందజేయాలని ఈ మేరకు ఎస్‌ఐ తెలిపారు.

హక్కుల కోసం పోరాడిన ముగ్దుం మోహిద్దీన్‌

చిలకలూరిపేట: దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే కార్మిక హక్కులతో పాటు ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడిన యోధుడు ముగ్దుం మోహిద్దీన్‌ అని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్‌ పి.శ్రీనివాసరావు కొనియాడారు. ప్రముఖ ఉర్దూ కవి, కమ్యూనిస్టు యోధుడు ముగ్దుం మోహిద్దీన్‌ జయంతిని ఎస్టీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు డబ్బులివ్వండి

నరసరావుపేట: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు కావాల్సిన నిధులు కేటాయించాలని శాసనసభ్యులు డాక్టర్‌ చదలవాడ అరవిందబాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి అభ్యర్థించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలతో పాటు త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్ల గురించి చర్చించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కోటప్పకొండ మహా తిరునాళ్లకు సమకూర్చవలసిన నిధులను కేటాయించాల్సిందిగా కోరారు. కాగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోటప్పకొండ తిరునాళ్లకు ప్రభుత్వం రూ.50 లక్షల నిదులు కేటాయించటం గమనార్హం.

ఇవేం భూముల విలువలు?

గజం స్థలం కొనాలంటే వినుకొండ వాసులు గజగజ వణికిపోయేలా చేశారు కూటమి పాలకులు. నిన్నా మొన్నటి వరకు ఈ పరగణాలో ఉన్న భూముల విలువలు నేడు మటుమాయమయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందల్లో భూమి విలువను పెంచడంతో అటు కొనుగోలుదారులు– ఇటు అమ్మకందారుల పరిస్థితి అగమ్యగోచరమైంది.

- వినుకొండలో 340 శాతం పెంచిన ప్రభుత్వం
- ప్రభుత్వం 15–20 శాతం పెంపు నిబంధనను పాటించని వైనం
- కనిష్టంగా 35 శాతం పెంచిన వైనం
- పెంచిన రేట్లను తగ్గించాలని డిమాండ్‌
- కాసుల కక్కుర్తితోనే ప్రజలపై భారం



వినుకొండ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం



నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖరులు (ఫైల్‌)



భూములు విలువ 340 శాతం పెంచినట్లు చూపుతున్న సైట్‌

వినుకొండ(నూజెండ్ల): సంపద సృష్టిలో భాగంగా ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువను పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 20 శాతం భూముల విలువపెంచాలని నిర్ణయించింది. అయితే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భూముల విలువ 340 శాతం గరిష్టంగా పెంచారు వినుకొండలో. ఎక్కడా నిబంధనలు పాటించకుండా ఇక్కడ ఇష్టానుసారంగా పెంచిన రేట్లను అమల్లోకి తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వ్యవసాయభూముల విలువను ఏకంగా లక్షల్లో పెంచారు. దీంతో ఇటు ప్రజలు, రైతులు, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు భూముల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అసలు వినుకొండలో ఏం జరిగింది?

సాధారణంగా భూముల మార్కెట్‌ విలువ పెంచాలంటే స్థానికంగా సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం నుంచి పెంచిన మార్కెట్‌ విలువను జతచేసి స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాల్లో తహసీల్దార్‌, అనంతరం ఆర్డీవో, డీఆర్వో, జాయింట్‌ కలెక్టర్‌, ఆమోదం అనంతరం పెంచిన విలువలు అమల్లోకి వస్తాయి. అయితే రాష్ట్రంలో అన్నీ ప్రాంతాల్లో మాదిరిగానే సవరించిన మార్కెట్‌ విలువ ఫైళ్లమీద జిల్లాస్నతాధికారుల ఆమోదం అనంతరం ఒక్కసారిగా పెంచిన రేట్లను చూసి అందరూ అవాక్కయ్యారు. వినుకొండలో సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల కాసుల కక్కుర్తితోనే కావాలనే భూముల విలువను పెంచి నివేదికలు పంపారని ఫలితంగానే భూముల విలువ పెరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వినుకొండ సబ్‌రిజిస్ట్రార్‌ పరిధిలో పెరిగిన భూముల విలువలు గతంలో వినుకొండ రూరల్‌ మండలం పరిధిలోని విఠంరాజుపల్లిలో ఒక్క చదరపు గజం విలువ 1600 ఉండగా ప్రస్తుతం 4000 రూపాయలుగా నిర్ణయించారు. దాదాపు 340 శాతం పెంచారు. అలాగే బొల్లాపల్లి మండలంలో 490 రూపాయలు ఉండగా పెంచిన మార్కెట్‌ విలువ 1200 చేశారు. అంటే ఇక్కడ 145 శాతం విలువను పెంచారు.

వినుకొండ టౌన్‌లో పెంచిన భూమి విలువలు ఇలా..

ఎన్‌టీఆర్‌ కాలనీ 5200 పెరిగిన విలువ 9000 (73 శాతం) శాలివాహన నగర్‌, మక్కెనగర్‌, స్వీపర్స్‌ కాలనీల్లో 5200–700 వరకు పెంచారు. ఎక్కడా కూడా ప్రభుత్వం నిర్ణయించిన 15,20 శాతం పెంచిన రేట్లలో అమలు కాలేదు. గతంలో ఎకరాల్లో విఠంరాజుపల్లిపల్లిలో ఎకరం భూమి మార్కెట్‌ విలువ 3.63 లక్షలు ఉండగా ఏకంగా 16 లక్షలకు పెంచారు. బొల్లాపల్లి మండలంలో 2.42 లక్షలు ఉండగా 7 లక్షలకు పెంచారు. ఇక గరిష్టంగా ఐనవోలులో ఎకరం భూమి విలువ గతంలో 29 లక్షలు ఉండగా ప్రస్తుతం 48 లక్షలకు పెంచడం గమనార్హం

బేషరతుగా తగ్గించాలి



ప్రభుత్వం 15 నుంచి 20 శాతం పెంచాల్సి ఉండగా కొందరు సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు కావాలనే భూముల విలువను పెంచి ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇవ్వటంతో వినుకొండలో సెంటుభూమి కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెంచిన రేట్లను వెంటనే తగ్గించాలి

–మతుకుమల్లి రామకృష్ణ, స్టాంప్‌ రైటర్‌, వినుకొండ

ఇష్టానుసారంగా పెంచారు!



విజయవాడలో 8 నుంచి 12 శాతం, ప్రకాశంజిల్లాలో కూడా 12 శాతం గరిష్టంగా పెంచారు. ఎక్కడాలేని విధంగా వినుకొండలో ఇష్టానుసారంగా భూముల విలువలు పెంచారు. డిసెంబరు నుంచి పెంపు ప్రక్రియ జరుగుతున్నప్పటికీ ఎవరి అభిప్రాయాలు తీసుకోకుండా కొంతమంది ఉద్యోగులు మార్కెట్‌ విలువ పెంచి నివేదిక తయారు చేశారు. రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

–కుందుర్తి హనుమంతాచారి, దస్తావేజులేఖరుల సంఘం కోశాధికారి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



భూముల విలువ అసంబద్ధంగా పెరిగినట్లయితే ఎనామిలిస్ట్‌ కమిటీ ఫిర్యాదు చేయవచ్చు కమిటీ నిర్ణయం మేరకు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. మాకు వచ్చిన ఫిర్యాదులు డీఆర్వోకి పంపుతాం. ఉన్నతాధికారులు ఆదేశిస్తే భూముల విలువ తగ్గిస్తాం

– కరీముల్లాఖాన్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ వినుకొండ

మూర్తయ్యకు పోలీస్‌ లాంఛనాలతో అంత్యక్రియలు



యద్దనపూడి: విధి నిర్వహణలో ఉంటూ గుండెపోటుతో మృతి చెందిన 242 బెటాలియన్‌ సీఆర్‌పీఎఫ్‌(సెంట్రల్‌ రిజర్వ్‌ పోలీస్‌ ఫోర్స్‌) 2006 బ్యాచ్‌ కానిస్టేబుల్‌ దావల చిన మూర్తయ్య అంత్యక్రియలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూర్తయ్య మరణవార్త తెలుసుకున్న భార్య, బిడ్డలు సొలస గ్రామానికి చేరుకున్నారు. అలాగే రాజమండ్రికి చెందిన 42 బెటాలియన్‌ సీఆర్‌పీఎఫ్‌, మూర్తయ్య విధులు నిర్వహిస్తున్న పూనేకు చెందిన 242 బెటాలియన్‌ సీఆర్‌పీఎఫ్‌ ఉన్నతాధికారులు, సిబ్బంది 16 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్‌ నుంచి అంతక్రియల ఖర్చుల నిమిత్తం నగదును అధికారులు అందించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో స్థానికంగా ఉన్న శ్మశానానికి పేటికను మోసుకెళ్లారు. ముందుగా మూర్తయ్య భౌతికకాయానికి సీఆర్‌పీఎఫ్‌ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళి అర్పించారు. మూర్తయ్య మృతికి సంతాప సూచకంగా తుపాకులతో సెల్యూట్‌ చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల సమక్షంలో సీఆర్‌పీఎఫ్‌ దళాల అశ్రునయనాల మధ్య కానిస్టేబుల్‌ మూర్తయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో జరిమానా

చిలకలూరిపేటటౌన్‌: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో పట్టుబడ్డ వ్యక్తికి కోర్టులో రూ.100 జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని బొప్పూడి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి డ్రంక్‌ అండ్‌ డ్రైను నిర్వహించారు. మూడు గంటల పాటు మద్యం తనిఖీలు నిర్వహించగా పూటుగా తాగిన వ్యక్తి వాహనం నడపడంతో రూరల్‌ పోలీసులు కేసునమోదు చేసి మంగళవారం కోర్టుకు హాజరుపరిచారు. దీంతో న్యాయమూర్తి అతనికి రూ.వెయ్యి జరినామా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



నరసరావుపేటలో పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు



నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో శ్రీభూ నీలా సమేత శ్రీనివాసుడు



విప్పర్లలో ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ మూర్తి మూలవిరాట్‌

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్య నారాయణమూర్తి ఉపాలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథసప్తమి ప్రాముఖ్యతను ఆలయ ప్రధానార్చకులు పరమేశ్వర శర్మ భక్తులకు వివరించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త మంత్రిరాజు సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసులు శ్రావణ కుమార్‌, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాస శర్మ, వేద పండితులచే రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆలయ మాడవీధుల నందు గరుడాళ్వార్‌ మీద స్వామి అమ్మవార్ల ఊరేగింపు కనుల పండవగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన సత్యసాయి మహిళా భక్తులు స్వామివారి సేవా దళ మహిళా భక్తులు, మహిళలచే కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బయ్య, ట్రెజరర్‌ కాళ్ళ రామకోటేశ్వరరావు, గుడిపాటి కోటేశ్వరరావు, అన్న బ్రహ్మం, మోటమర్రి నాగేశ్వరరావు, వాసు ఆదినారాయణ తదితరులు పాల్గొని ఉత్సవ ఊరేగింపు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్‌: సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో వేంచేసియున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నారాయణం వెంకట హనుమంతాచార్యులు పర్యవేక్షణలో నారాయ ణం సందీప్‌ దీక్షితులు ఆధ్వర్యంలో పండితులు 27సార్లు ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీ నరసింహ సహిత ధనశ్రీ సుదర్శన మహాయాగం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం శ్రీభూ నీలా సమేత శ్రీనివాసుని కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నూజెండ్లలో...

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల గ్రామంలో రథసప్తమి వేడుకలు ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ పూజారి క్రోసూరు రామమోహనాచార్యులు తెలిపారు.ఈసందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, తోమాలసేవ, సహస్రనామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వినుకొండలో స్వామివార్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



నూజెండ్లలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ

- జేసీ సూరజ్‌ గనోరే
- ఎన్‌ఈసీలో ఎన్‌సీసీ అంతర్‌ కళాశాలల పోటీలు
- పాల్గొన్న 400 మంది క్యాడెట్స్‌



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ సూరజ్‌ గనోరే

నరసరావుపేట రూరల్‌: విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ సూరజ్‌ గనోరే తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్‌ కళాశాల జూబిలేషన్‌ 2కె25లో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్స్‌ ఇంటర్‌ కాలేజీ పోటీలు మంగళవారం నిర్వహించారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్‌లోని నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని 15 కాలేజీలు, ఆరు పాఠశాలల నుంచి 400 మంది క్యాడెట్స్‌ పాల్గొన్నారు. స్క్వాడ్‌ డ్రిల్‌ గార్డ్‌ ఆఫ్‌ హనర్‌, టగ్‌ ఆఫ్‌ వార్‌, గ్రూప్‌ డాన్స్‌ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్‌ ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల ముగింపు కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ సూరజ్‌ గనోరే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన ఎన్నో అద్భుత అవకాశాలు పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్‌ చైర్మన్‌ మిట్టపల్లి చక్రవర్తి, వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ డి.సునీల్‌, ఎన్‌సీసీ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ ఎం.రాజేష్‌ బాబులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

స్క్వాడ్‌ డ్రిల్‌–నరసరావుపేట ఇంజినీరింగ్‌ కళాశాల (ప్రథమ), బాపట్ల ఉమెన్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల (ద్వితీయ), గార్డ్‌ ఆఫ్‌ హనర్‌–నరసరావుపేట ఇంజినీరింగ్‌ కళాశాల (ప్రథమ), ప్రకాశం జిల్లా కాలేజీ (ద్వితీయ), టగ్‌ ఆఫ్‌ వార్‌ పురుషుల విభాగం– నరసరావుపేట ఇంజినీరింగ్‌ కళాశాల (ప్రథమ), ప్రకాశం ఇంజినీరింగ్‌ కళాశాల (ద్వితీయ), మహిళల విభాగం– వివిఐటి నంబూరు (ప్రథమ), బాపట్ల ఉమెన్స్‌ కళాశాల (ద్వితీయ), గ్రూప్‌ డాన్స్‌–నరసరావుపేట ఇంజినీరింగ్‌ కళాశాల (ప్రథమ), శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌ (ద్వితీయ), కేఎల్‌ వర్సిటీ (తృతీయ) బహుమతులు సాధించారు.

వృక్షో భక్షితః!!



నరసరావుపేట రూరల్‌ :మండలంలోని కాకానిలో టీడీపీ నాయకులు బరితెగించారు. చెరువు కట్ట పటిష్టంగా ఉండేందుకు పెద్దలు నాటిన చెట్లను నరికివేస్తున్నారు. గత నెలలో చెట్ల నరికివేతను టీడీపీ నాయకులు చేపట్టారు. గ్రామస్తులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నరికివేతను నిలిపివేశారు. మంగళవారం మరోసారి చెట్లు నరికివేతను ప్రారంభించారు. భారీ క్రేన్‌ ఉపయోగించి మిషన్‌లతో చెట్ల నరికివేతను చేపట్టారు. స్థానిక సిబ్బందికి గ్రామస్తులు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో జిల్లా అటవీ, రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. టీడీపీ నాయకులే చెట్లను తొలగిస్తుండటంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారు. అయితే వందలాది ఎకరాలకు సాగునీటిని అందించే చెరువు కట్ట పటిష్టతకు ఉపయోగపడే చెట్లు నరికివేతపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త సేకరణ పనులు మానుకోండి

- వేరే ఉపాధిలో కొనసాగండి
- కలెక్టర్‌ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు సూచన
- ఇరువురు లబ్ధిదార్లకు తోపుడు బండ్లు అందజేత



బండి అందజేస్తున్న కలెక్టర్‌, ఎస్పీ, అధికారులు

నరసరావుపేట: చెత్తను సేకరించి జీవిస్తున్న వారు ఆ పని మానుకొని వేరే పనులకు మార్పు చెందాలని, ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని జిల్లా కలెక్టర్‌ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం దళిత బహుజన రిసోర్స్‌ సెంటర్‌ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న సీబీ కాలనీకి చెందిన ఇద్దరు వేస్ట్‌ పిక్కర్స్‌కు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో మూడు చక్రాల బళ్లను వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. డీబీఆర్‌సీ సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు కలెక్టర్‌, ఎస్పీ, డీఆర్వో, ఆర్డీవోలు అభినందనలు తెలిపారు. దళిత బహుజన రిసోర్స్‌ సెంటర్‌ నరసరావుపేట సిటీ కోఆర్డినేటర్‌ తోకల సాంబయ్య, డీఆర్వో ఏ.మురళి, ఆర్డీవో కె.మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌ఎస్‌ అండ్‌ ఎన్‌ కళాశాలలో జాతీయస్థాయి వర్క్‌షాప్‌

నరసరావుపేట ఈస్ట్‌: శ్రీసుబ్బరాయ అండ్‌ నారాయణ కళాశాలలో ఈనెల 6వతేదీ గురువారం అడ్వాన్స్‌డ్‌ టెక్నిక్స్‌ ఇన్‌ జెనోమిక్‌ డీఎన్‌ఏ అండ్‌ హెచ్‌పీఎల్‌సి మెథడ్స్‌ అనే అంశంపై ఒకరోజు జాతీయస్థాయి వర్క్‌షాప్‌ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం.ఎస్‌.సుధీర్‌ తెలిపారు. ఈమేరకు వర్క్‌షాప్‌ బ్రోచర్‌ను మంగళవారం కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్‌, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పి.శ్రీనివాససాయి, వర్క్‌షాప్‌ కన్వీనర్‌ డాక్టర్‌ ఐ.సదాశివరెడ్డి, కోకన్వీనర్లు డాక్టర్‌ పి.శ్రీనివాసరావు, ఆర్‌.వేణుమాధవ్‌ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

నరసరావుపేట రూరల్‌: క్యాన్సర్‌ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎఎంరెడ్డి ఫార్మసీ కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెట్లూరి వారిపాలెంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్‌ డీన్‌ డాక్టర్‌ లక్ష్మీ సురేఖ, విభాగాధిపతి డాక్టర్‌ జి.కిరణ్‌ పాల్గొన్నారు.

ఫైర్లను పరిశీలించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్‌

కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు

రొంపిచర్ల: శనగ.. కష్టాల కనగ అనే కథనంతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించారు. మండలంలోని గోగులపాడు, కొనకంచివారిపాలెం గ్రామాల్లో సాగవుతున్న శనగపైరును పరిశీలించారు. 70 నుంచి 80 రోజులు వయస్సు గల పంటలో తుప్పు తెగులు, మొక్కల పై నుంచి ఆకులు నల్లగా ఎండిపోతున్నట్లు గుర్తించారు. దీని నివారణకు టిల్ట్‌ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అలాగే కంది పైరును కూడా పరిశీలించారు. కంది పైరును మరుక మచ్చల పురుగు ఆశిస్తుందన్నారు. మరుక మచ్చల పురుగు నివారణకు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను, రసాయన మందుల వాడకాన్ని సూచించారు. మరుక మచ్చల పురుగు ఆశించిన పైరుపై ముందుగా వేప సంబంధిత మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం పురుగు నిర్మూలనకు అవసరమైన మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. శనగ, కంది పంట పొలాలను సందర్శించిన వ్యవసాయ అధికారులో డీడీఏ శివకుమారి, ఏడీఏ పి. మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి శివలలిత, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు రమేష్‌, శ్రీనివాస్‌, కళ్యాణ్‌, రెతులు పాల్గొన్నారు.

ఎవరివీ ఈ లే అవుట్లు?



నాదెండ్ల: గణపవరం రెవిన్యూ పరిధిలో అనుమతి లేని లేఔట్లను పంచాయతీ అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థానికులు కొందరు పంచాయతీ అధికారులకు అనధికార లేఔట్లపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు ఇంజినీరింగ్‌ సిబ్బందితో కలిసి గణపవరం–కావూరు డొంక రోడ్డులో ఇటీవల వేసిన వెంచర్‌ను పరిశీలించారు. అనుమతి లేదన్న విషయం తెలుసుకున్న అధికారులు పరిశీలించి కొలతలు తీసుకున్నారు.

వ్యర్థాలు దగ్ధం చేయవద్దు

నాదెండ్ల: హెచ్‌టీ విద్యుత్‌ లైన్లు ఉన్న ప్రాంతాల్లో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల విద్యుత్‌ కోత ఏర్పడి నష్టం కలుగుతోందని తహసీల్దార్‌ ఏవీ రమణ చెప్పారు. తహసీల్దార్‌ కార్యాలయంలో పవర్‌గ్రిడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ అధికారులు మంగళవారం అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. శివారులోని పొలాల మీదుగా సాగే హెచ్‌టీ విద్యుత్‌ లైన్ల క్రింద పంట వ్యర్థాలను దగ్ధం చేయకూడదన్నారు.